# 'ఆడబతుకు'

-రచన: శారదా అశోక్‌వర్ధన్

"ఏయ్ చిత్రా!... ఏం చేస్తున్నావ్?" పొద్దుటే ఫోన్ చేసి పలకరించింది గౌరి. గౌరి పొద్దుటే ఫోన్ చేసిందంటే ఏదో ప్లానుందన్న మాట. "సరోవర్ హోటల్ దగ్గర మంచి శారీస్ సెకెండ్స్ చీపుగా అమ్మేస్తున్నారు. అయిదువందల చీర యాభై రూపాయల కేట. ఎంచక్కగా అయిదువందలకి పది చీరలొస్తాయి" అంటుంది. లేదా "హోటల్ సుప్రభాత్‌లో స్పెషల్ టిఫిన్ అయిటమ్స్‌ట. ఇవ్వాళ వెళ్లిన వాళ్లకి అన్ని ఐటమ్స్ హాఫ్ రేట్‌కేట, వెళదాం" అంటుంది. లేదా "ఐమాక్స్‌లో చాలామంచి మూవీ వచ్చింది. అమితాబ్, రాణీముఖర్జీ–వెళదాం. మా డ్రైవర్‌ని పంపించి నేను టిక్కెట్లు తెప్పించేస్తాను" అంటుంది. ఇవీ దాని ఫోన్‌కాల్స్ విశేషాలు. అందుకే ఈసారి ఏం ప్రోగ్రామ్ తల్లీ..." అడిగాను.

"చిత్రా...ఇవ్వాళ గానసభలో మా ఫామిలీ ఫ్రెండ్ సుధాకర్‌రావుగారి పుస్తకావిష్కరణ కార్యక్రమం వుందే. అమ్మానాన్నా వెళుతున్నారు. నీకు తెలుసుకదా నాకిలాంటివిపడవని. కానీ, వెళ్లకతప్పదు. వెళితే బోర్‌కొడుతుంది. ప్లీజ్ నువ్వూ రావే! నీకు దండం పెడతాను. మనం హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు". ఏక బిగిన చెప్పి దండం పెట్టేసి ప్రాధేయపడుతున్న దాన్ని వింటే నవ్వొచ్చింది. "అలాగేలే! ఎన్నింటికీ" అంది.

"సాయంత్రం ఆరింటికిట. మనం అయిదున్నరకన్నా బయలుదేరాలి. లేకపోతే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతాం".

"ఆ... ఇవన్నీ టైముకి మొదలవుతాయా ఏమిటి?" అన్నాను దాని కంగారు చూసి నవ్వుతూ.

"సుధాకర్‌గారు చాలా పంక్చువల్. కరెక్టుగా మొదలెట్టమని చెప్పార్ట ఆ నిర్వాహకులకి" అంది.

"సరేలే!" అన్నాను.

ఆ రోజే పేపర్లో ఆనాటి కార్యక్రమాల వివరాలు చూశాను –ఈ కార్యక్రమం గురించి కూడా వేశారేమోనని! ప్రఖ్యాత రచయిత డాక్టర్ సుధాకర్‌రావు గారు రచించిన 'ఆడ బతుకు' పుస్తకాన్ని, సాంస్కృతిక, విద్యాశాఖమాత్యులు ఆవిష్కరిస్తారు అని వుంది. సరే మంత్రి గారు కూడా వున్నారు కాబట్టి సమయానికే కార్యక్రమం ప్రారంభం అవుతుంది అనుకున్నాను. సాయంత్రం అయిదింటికల్లా తయారై, ఇంట్లో వాళ్లకి చెప్పి చిత్రావాళ్లతో వెళుతున్నానని, కార్యక్రమం అయిపోయాక గౌరి దింపేస్తుందని కూడా చెప్పి ఆటోలో బర్కత్‌పురాకి బయలుదేరాను.

మారేడుపల్లి నుంచి బర్కత్‌పురా వెళ్లడానికి ట్రాఫిక్‌లో నలభై అయిదు నిముషాలు పట్టింది. అప్పటికే గౌరీ వాళ్ల నాన్నగారు నాగభూషణంగారూ, అమ్మ హైమవతీ రెడీ అయి సిద్ధంగా వున్నారు. నన్ను చూడగానే గౌరికి ప్రాణం లేచొచ్చింది. "పద.. పద.. లేటయిపోతుంది" అంటూ బయట కొచ్చింది. ఆటోని పంపించేసి నేనూ వాళ్ల కారెక్కాను. బర్కత్‌పురా నుంచి చిక్కడపల్లికి సరిగ్గా నలభై అయిదు నిమిషాలు పట్టింది ట్రాఫిక్‌లో. ఏదో అందరం వున్నాం కాబట్టి మాట్లాడుకుంటూ చేరుకున్నాం. అదే ఒక్కరే అయితే ఆ జనాన్ని చూసి పిచ్చెక్కుతుంది. ఎక్కడ చూసినా, ఏ రోడ్డు చూసినా జనమే. ప్రతీ దుకాణం క్రిక్కిరిసే కనబడుతుంది. ప్రతీ హోటల్ జనంతో కిటకిటలాడుతూ వుంటుంది. పేవ్‌మెంట్లు మీదా జనం, బస్సుల నిండా ఫుట్‌బోర్డు మీద కూడా నుంచొని జనం! ఎప్పటికప్పుడు నేలఈనినట్టే వుంటుంది. గాన సభ దగ్గర దిగాం. నాగభూషణం గారు పక్కగా కారు పార్కు చేసొచ్చారు. గడియారం చూశాను. సరిగ్గా ఆరు. అంత జనంలోంచి వొచ్చామేమో, హాలు ఖాళీగా చూసేసరికి ఏమిటోగా అనిపించింది. కార్యనిర్వాహకులు ఎవ్వరూ కనిపించలేదు. మళ్లీ మళ్లీ తల అటూఇటూ తిప్పి చూసేసరికి, వేదిక మీద ఆరోజు కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్ కడుతూ ఇద్దరు ముగ్గురు కనిపించారు. నాగభూషణం గారిని చూడగానే "రండి రండి కూర్చోండి" అంటూ కుర్చీలు చూపించారు. అందరం కూర్చున్నాం. నేనూ గౌరీ మాటల్లో పడిపోయాం. మా కాలేజీ విషయాలు, మిగతా ఫ్రెండ్స్, లెక్చరర్లు, సినిమాలు, ఫ్యాషన్లు, ఎన్నో విషయాలు మాట్లాడుకుంటున్నాం. సడన్‌గా, "ఇంకా కార్యక్రమం మొదలెట్టలేదేమిటీ?" అనుకుంటూ అటు ఇటూ చూశాం. ఒక పాతికమంది వరకు వచ్చారు జనం. సమయం ఆరున్నర దాటింది. ఆవిష్కరింపబడే పుస్తకాలను చక్కగా మెరిసే కాయితంలో, ఎర్ర రిబ్బన్‌తో ముడికట్టి, పట్టుకొచ్చారు సుధాకర్‌రావు గారు. కార్యకర్తలు ఆ కట్టని సుధాకర్‌గారి చేతిలోంచి అందుకున్నారు.

"అన్నయ్య గారూ, వొదినగారు రాలేదా?" అడిగారు హైమావతి గారు.

"లేదండి! సరిగ్గా బయలుదేరే సమయానికి విజయవాడ నుండి ఎవరో బంధువులొచ్చారు! పాపం రాలేకపోయింది" అన్నారు.

మరో అరగంటకల్లా, ఆ కార్యక్రమంలో మాట్లాడవలసిన వారూ, మరో పదిమంది దాకా వొచ్చేశారు.

"ఏమిటీ ఆలస్యం?" అడిగారు అధ్యక్షుల వారు.

"మంత్రిగారికి కొంచెం ఆలస్యమవుతుందట" కార్యదర్శి చెప్పాడు.

"మరయితే వేదిక ఖాళీగా వుంటే ఏం బాగుంటుంది?" అన్నారాయన విసుగ్గా...

"లేదు. అందుకే మన చిన్నారావు గారికి ఫోన్ చేశాను. వొచ్చి కొన్ని పాటలు పాడమని చెప్పాను. మాటల్లోనే వొచ్చారు, చిన్నారావు గారూ, శ్రీమతి సాహితీశ్రీ! రావడమే గబగబా వేదిక మీదకి వెళ్లి పోయారు. వాళ్ల వెంట ఒక తబలా ఆర్టిస్టూ, ఒక గిటారు వాద్యకుడు కూడా వెళ్లారు. వెంటనే వ్యాఖ్యాత అనౌన్స్ చేశారు. సుప్రసిద్ధ గాయకుడు చిన్నారావు గారి పాటల కార్యక్రమం ప్రారంభమవుతుంది అని. తెర జరిగింది.

'అమ్మా! ... అమ్మా!.... అమ్మా...!" అంటూ ఆలాపనలో మొదలయింది పాట.

"అమ్మను మించిన దైవముకలదే
అమ్మే కదా అసలు దైవము
అన్నిటికన్నా అమ్మే మిన్నా...
అమ్మే పరబ్రహ్మ రూపము "అమ్మా".

దాదాపు ఆరు ఏడూ చరణాలతో, పదిహేను నిముషాలు సాగింది పాట. అందరూ తన్మయత్వంలో తలలూపుతున్నారు. చివరగా కరతాళ ధ్వనులతో హాలంతా మారుమోగింది.

మళ్లీ వ్యాఖ్యాత! "కుమారి సాహితీశ్రీ కూడా అమ్మ మీదే మరో పాట పాడ్తారు." సాహితీశ్రీ పాడ్డం మొదలెట్టింది.

**"అమ్మ అనే మాట అలుపు దీర్చుపాట...**
**అమ్మ అనే పాట రతనాల మూట...**
**అమ్మ అంటే దేవత, అమ్మ ఒడి ఒక స్వర్గమూ,**
**అమ్మ వుంటే చాలు ఇంక ఏదీ అవసరమూ"** ॥అమ్మ॥

ఈసారీ మళ్లీ పెద్దగా చప్పట్లు!

"అమ్మకి ఎన్ని చప్పట్లో" అంది గౌరి వాళ్లమ్మ కేసి చూస్తూ.

"చప్పట్లు బాజాలు ఎందుకే! అందరూ అమ్మని దేవత, దేవత అంటూ, బోలెడు పద్యాలు రాసేస్తున్నారు. పాటలు రాసేస్తున్నారు. సినిమాలలోనూ అమ్మమీది పాటలు అమోఘంగా ఒస్తున్నాయి. కానీ"... ఆపిందావిడ.

"కానీ... ఏమిటంటే?"

"అదేనమ్మా... ఎందరు అమ్మకి ఆమె స్థానాన్నిచ్చి గౌరవంగా చూస్తున్నారు? ఆమెని దేవతగా పూజించనక్కర లేదు. సాటి మనిషిగా చూడడం లేదు. చిన్నప్పుడు తనకి గోరుముద్దలు తినిపించిన అమ్మకి ప్రేమగా ఒక ముద్ద దగ్గర కూర్చుని తినమంటున్నాడా కొడుకు, కూతురు ఎవరైనా? కోడళ్లయితే సరేసరి. ఇప్పుడు కొత్తగా అత్తా కోడళ్ల ట్రెండు మారింది. పని మనుష్యులు దొరకడం లేదు. పిల్లల్ని చూసుకోవడానికి. వంట వాళ్లు కాస్ట్లీ. పైగా నమ్మలేము. దొంగతనాలు, దొరతనాలు ఎన్నో! అంతకంటే, అత్తగారితో కాస్త మంచిగా మాట్లాడి, పుట్టిన రోజుకో, పెళ్లి రోజుకో ఓ చీర ఆవిడకి కావలసినది కొనిచ్చేసి, ఆ తరువాత ఇంట్లో వంటపని, పిల్లల్ని స్కూల్లో దింపి, తేవడం వగైరాలన్నీ చేయించుకుంటే హాయి! అంతే కానీ పాపం! ఆ తల్లికి ఓపిక వుందా లేదా? చిన్నప్పటి నుంచి తమ చదువుల కోసం, తమందరి కోసం చాకిరీచేసి చేసి అలిసిపోయిన ఆమె, వయస్సు మళ్లాకయినా, ఏ బంధనాలూ లేకుండా, హాయిగా వుండగలుగుతోందా? ఆ మాత్రం సుఖాన్ని ఆవిడకి అందివ్వడం, వాళ్ల కనీస ధర్మం కాదా అని ఎవ్వరూ ఆలోచించడంలేదు. కూతుళ్లు, కొడుకులు, కోడళ్లు అందరూ అంతే! పుట్టినప్పటి నుంచీ ఆమెకి గొడ్డు చాకిరీ తప్పదు. అమ్మ మీద, అమ్మని దేవతని చేస్తూ ఎన్నెన్ని కవితలూ, ఎన్నెన్ని పాటలు ఎన్నో రకాలుగా వినిపిస్తున్నాయి. కానీ, అమ్మనీ సాటి మనిషిగా చూస్తే, ఆమె అంతరంగం ఉప్పెనలా పొంగిపోదూ? నన్నడిగితే అదే ఎవరైనే అమ్మకిచ్చే ఆనందం!" అంది ఆమె గుక్క తిప్పుకోకుండా!

ఆమె మాటలు ఆణిముత్యాల్లా తోచాయి నాకు!

అమ్మ జ్ఞాపకమొచ్చింది. గడియారం చూశాను. పదవుతోంది. హాలు ఖాళీ అయిపోయింది. అందరూ వెళ్లిపోతున్నారు. బహుశా ఆర్గనైజర్లు, సుధాకర్‌రావు గారి తాలూకు వాళ్లు మాత్రమే మిగిలారు. ఖాళీ కుర్చీలు వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి. అయినా, ఇంకా ఆ ఉపన్యాసకుడు, తన స్వంత జోకులకి తనే నవ్వుకుంటూ మహదానందంగా ఉపన్యసిస్తూనే వున్నాడు. అందుకే "మైకాసురుడంటారేమో' ఇట్లాంటి వాళ్లని చూసి! మరో పావు గంటకి కార్యక్రమం పూర్తయింది. హాల్లోంచి 'హమ్మయ్య' అన్నట్టు ఉన్న ఆ పదిమందీ పరుగులు తీస్తున్నారు. నాకు 'ఆడ బతుకు' పుస్తకావిష్కరణ మరువలేని సంఘటనగా గుర్తుండి పోయింది. పాపం! సుధాకర్‌రావు గారి భార్య ఆడబతుకుకి నిదర్శనమే కదు! బంధువులొస్తే ఆమె కార్యక్రమానికి బ్రేక్! ■